క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి

గూడెంకొత్తవీధి: మండలంలోని దారకొండ పంచాయతీలో చిలకవీధి, దుర్గం, జాజు పాకలు, గొల్లపల్లి, సబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సీపీఎం మండల కార్యదర్శి ముర్ల చంటిబాబు శుక్రవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వారాల తరబడి కూలి చెల్లించకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతన బకాయిలు విడుదల చేయకుంటే ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సోమరాజు, శ్రీనుబాబు, గంగరాజు, పెద్దబాయి, సత్యమూర్తి పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు అందజేయాలని, పనులు జరుగుతున్న చోట టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు కల్పించాలని జనసేన మండల అధ్యక్షుడ సాయికృష్ణ చెప్పారు. ఏపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక సమస్య వల్ల వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడలో శుక్రవారం సర్పంచ్ నాగులమ్మ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భూసారం పెంచేందుకు ఈ విత్తనాలను వేయాలని సూచించారు. సబ్సిడీపై వ్యవసాయ అందజేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో మధుసూదన్ కోరారు. మాజీ ఎంపీటీసీ ఎం.లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ బంగారయ్య, స్థానికులు చంటిబాబు, చిట్టిబాబు, బుజ్జి పడాల్ తదితరులు పాల్గొన్నారు

వరి విత్తనాలకు ప్రతిపాదనలు



ఏవో మధుసూధన్

గూడెంకొత్తవీధి: మండలానికి సంబంధించి 1199 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ఈ మేరకు ప్రతిపాదనలు చేసినట్టు ఏవో మధుసూధన్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 300 క్వింటాళ్లు వచ్చేస్తాయన్నారు.

ఆర్‌జీఎల్–25378 రకం 150 క్వింటాళ్లు, ఎంటీయు–1121 రకం 211 క్వింటాళ్లు, ఎంటీయు–1318, ఉరకంక–17 క్వింటాళ్లు, ఎంటీయు–1064 రకం 193 , ఎన్ఎల్ఆర్–34449 రకం 264, ఎంటీయూ–1061 రకం 35, ఆర్ఎన్ఆర్–15048 రకం 201 క్వింటాళ్లు, ఎంటీయు–1224 రకం 40 క్వింటాళ్లకు ప్రతిపాదించామన్నారు.

గిరిజన చట్టాలు సక్రమంగా అమలుచేయాలని వినతి



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ కారం లక్ష్మి

వి.ఆర్.పురం: ఏజెన్సీలో గిరిజన చట్టాలు, హక్కులను అమలు చేయాలని కోరుతూ గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో వివిధ సచివాలయల్లో అధికారులు, సిబ్బందికి శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు. ఏజెన్సీలో నూరుశాతం ఉద్యోగులను గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. రామవరం ములకలపల్లి సచివాలయల ముందు ధర్నా చేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, మరయ్య, నాయకులు చినబాబు, ప్రసాద్, కళ్యాణ్, రాజయ్య, భద్రయ్య, కన్నయ్య, జోగారావు, లెనిన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దోమలమందు పిచికారీ



దోమల మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలో ఎంపిక చేసిన 24 గ్రామాల్లో దోమల మందు పిచికారీ శుక్రవారం పూర్తయినట్టు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం రాజవొమ్మంగి టౌన్‌లో మొదటి విడత పిచికారీ జరుగుతున్నాయన్నారు. ఆ తరువాత ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లో స్ప్రేయింగ్ చేపడతామన్నారు.దోమలమందు పిచికారీకి ప్రజలు సహకరించాలని కోరారు. పలు ప్రాంతాల్లో పిచికారీని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు శుక్రవారం పర్యవేక్షించారు.

సమస్యలతో సతమతం



చింతపల్లి బస్ కాంప్లెక్స్



నామమాత్రంగా పనిచేస్తున్న మోటారు బావి



తాళాలు వేసి ఉన్న మరుగుదొడ్లు

- బస్ కాంప్లెక్స్‌లో కనీస సదుపాయాలు కరువు
- 5 జిల్లాలు 6 డిపోల ద్వారా రాకపోకలు
- వెలగని లైట్లు, తిరగని ఫ్యాన్లు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ప్రయాణికుల అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు



నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

చింతపల్లి: అంతర్రాష్ట్ర పరిధిలో ప్రయాణాలు సాగిస్తున్న చింతపల్లి బస్ కాంప్లెక్సులో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడుతున్నారు. మూడు దశాబ్దాలు క్రితం నిర్మించిన ఈ బస్ కాంప్లెక్స్‌లో నేటికీ కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్ కాంప్లెక్సు మీదుగా 5 జిల్లాలకు సంబంధించి విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తుని, నర్సీపట్నం, పాడేరు డిపోల నుంచి బస్సులు హైదరాబాద్, భద్రాచలం, మల్కన్‌గిరి, చిత్రకొండ, సీలేరు, రంపచోడవరం, రాజమండ్రి, సీలేరు, కొయ్యూరు, కె.డి.పేట తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. ప్రతిరోజు సుమారు 25 నుంచి 30 బస్ సర్వీసులు ద్వారా వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే ఈ కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరుగుదొడ్లకు తాళం

బస్ కాంప్లెకులో ఉన్నటువంటి సెప్టిక్ ట్యాంకు పూర్తిగా నిండిపోవడంతో మరుగుదొడ్లకు తాళం వేశారు.దీంతో ప్రయాణికులు మల, మూత్ర విసర్జనకు నానా అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసే మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. మరుగుదొడ్ల చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు, విష కీటకాల సంచారంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

అలుముకున్న అంధకారం

ఈ కాంప్లెక్స్‌లో పగటితో పాటు రాత్రి సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు అర్ధ రాత్రికి వచ్చే భద్రాచలం, హైదరాబాదు సర్వీసుల కోసం ప్రయాణికులు ఎదురు చూడాల్సి వస్తుంది.అటువంటి సమయంలో కనీసం విద్యుత్ లైట్ల సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.అదీ కాకుండా గ్రామానికి కిలోమీటరు దూరంలో ఈ కాంప్లెక్సు ఉండడం వలన అంధకారంలో బస్సుల కోసం ఎదురు చూడడానికి ప్రయాణికలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు చీకటి పడితే ఈ కాంప్లెక్స్ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుంది. కనీసం ఒక్క ఫ్యాన్ కూడా పనిచేయడం లేదు. దోమల బెడద, ఉక్కపోతతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణానాతీతం. ప్రయాణికులకు కనీసం కూర్చోవడానికి పూర్తిస్థాయి బెంచీలు సౌకర్యం లేదు. బస్సుల కోసం నిలబడే ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడో ఏర్పాటు చేసిన బల్లలు పూర్తిగా పాడయిపోయిన పరిస్థితి. బస్సు కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలపై స్థానికులు, ప్రయాణికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

లైట్లు ఏర్పాటుచేయాలి



బస్ కాంప్లెక్సులో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి బస్సుల కోసం అంధకారంలోనే ప్రయాణికులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఫ్యాన్లు పనిచేయడం లేదు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– కవడం ఈశ్వరరావు, స్థానికుడు

మహిళా ప్రయాణికుల పరిస్థితి ఏమిటి



మేము భద్రాచలం నుంచి ప్రయాణం చేసి వస్తున్నాం. ఈ కాంప్లెక్సులో మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉన్నాయి. మహిళా ప్రయాణికుల పరిస్థితి ఏమిటి. ఆర్టీసి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

– భవాని, ప్రయాణికురాలు, విశాఖపట్నం

మరుగుదొడ్లకు తాళం వేయడం దారుణం



బస్ కాంప్లెక్సులో సెప్టిక్ నిండిపోయిందని బోర్డు పెట్టి మరుగుదొడ్లకు తాళం వేశారు. దాంతో గత 15 రోజులుగా మహిళా ప్రయాణికులు అత్యవసరాలకు ఇబ్బందులు పడవలసి వస్తుంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి మరుగుదొడ్లను వినియోగంలోనికి తీసుకురావాలి.

– రాద ప్రయాణికురాలు, లంబసింగి.

గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్

రంపచోడవరం: రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో గిరిజనేతరులు అక్రమంగా నిర్మించిన భవనాలు, రిసార్ట్స్, లాడ్జీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధికారులను డిమాండ్ చేశారు. రంపచోడవరం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు కూల్చాలన్నారు. గిరిజన ప్రాంతంలో బయట ప్రాంతం నుంచి బతుకు తెరువు కోసం వచ్చిన గిరిజనేతర బడాబాబులు మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లో రిసార్ట్స్, లాడ్జీలు, మల్టీ స్టోర్డ్ భవనాలు నిర్మించారని, అలాంటి వారిని వదిలిపెట్టి చిరువ్యాపారుల మీద చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. గిరిజనేతరులు నిర్మించుకున్న అక్రమ కట్టడాలు, రిసార్ట్స్ ,లాడ్జీల కూల్చివేతకు ప్రభుత్వ అధికారులకు సహకరించాలన్నారు. అధికారులు అక్రమ రిసార్ట్స్‌పైన స్పందించిక పోతే సీపీఎం, గిరిజన సంఘం తరపున ఉద్యమ పోరాటాలు చేస్తామని అధికారులను హెచ్చరించారు. నాయకులు రామారావు, వాణిశ్రీ, శాంతిరాజు, సిరిమల్లిరెడ్డి, శ్రీను, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో రికార్డుల తనిఖీ



ముంచంగిపుట్టు రేషన్ డిపోలో స్టాకను పరిశీలిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంతో పాటు లక్ష్మీపురం, బరడ, బుంగాపుట్టు పంచాయతీల్లోని రేషన్ డిపోలను తహసీల్దార్ ఆర్.వి.ఎస్.నర్సమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. డిపోల్లో స్టాకు, రికార్డులను పరిశీలించారు. తూనిక మిషన్లు సరిచూశారు. సేల్స్‌మన్లు పరిస్థితులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేల్స్‌మెన్లు డిపోల్లో రికార్డులను సక్రమంగా ఉంచాలని సూచించారు. సెల్స్‌మెన్లు నిత్యం రేషన్‌దారులకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంగా విధులు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్‌ల వివరాలు రికార్డులలో నమోదు చేయాలని ఆదేశించారు. సరుకుల నిల్వల్లో ఎటువంటి తేడాలు ఉన్న కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, సెల్స్‌మెన్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

సీలేరు: గాలికొండ పంచాయతీ పరిధిలోని పాత్రునిగుంట, బుగ్గిరేవుల, మైనకోట, గుర్రాలగొంది, సప్తగూడ గ్రామాలను ఎస్ఐ రవీంద్ర శుక్రవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు మంజూరు, తాగునీటి సమస్య, మైనకోట నుంచి జాజిగొంది వరకు రోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరారు. దీనిపై ఎస్ఐ రవీంద్ర తక్షణమే స్పందించి చింతపల్లి ఏఎస్పీకి ఆయా సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరూ స్నేహపూర్వక వాతావరణంలో కలిసిమెలసి ఉండాలని, గొడవలు పడవద్దని, ఏదైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసులు, సీఆర్‌పిఎఫ్ సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

వై.రామవరం: జీవో నెంబరు–3 పునరుద్ధరించి, ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీను ప్రకటించి, ఆదివాసీలతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయాలని కోరుతూ సీఐటీయూ, గిరిజన సంఘం నాయకుడు కంభం శాంతిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం వై.రామవరం, యార్లగడ్డ సచివాలయాలతో పాటు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్య, వైద్యం, ఉద్యోగాలు, సామాజికంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ గిరిజనుల కోసం, అప్పటి పాలకులు జీవో నంబరు3 తీసుకువచ్చారన్నారు. ఇప్పుడిప్పుడే దాని ఫలాలు అందిపుచ్చుకుంటు అభివృద్ధి వైపు పయనిస్తుండగా, ప్రస్తుత పాలకులు జీవో నంబరు–3ను రద్దు చేసి, ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి, డీఎస్సీ నుంచి ఏజన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి, ఏజన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లికార్జునరావు, లక్ష్మణరెడ్డి, మురలి, విక్కీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

దుంబ్రిగుడ: స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో నీలిమ మాట్లాడుతూ కిశోర బాలికల కోసం వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎల్.చినబాబు పాత్రుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లులో మరమ్మతు పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోలవరం నిర్వాసితుల డిమాండ్

వి.ఆర్.పురం: మండల కేంద్రంతో పాటు వడ్డుగూడెం, రాజుపేట, చింతరేగిపల్లి తదితర గ్రామాలకు చెందిన పోలవరం నిర్వాసితులు తమకు గోవకవరం మండలం కొత్తపల్లి, సీతానగరం మండలం చీపురుపల్లి గ్రామాల్లో పునరావాసం కల్పించాలని కోరారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పర్యటించామని, అక్కడ వ్యవసాయ భూములు ఎక్కువగా ఉన్నాయని, ఉపాధి పనులు ఉంటాయన్నారు. అధికారులకు వినతపత్రాలు అందజేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో గృహాలు నిర్మించి పునరావాసం కల్పించాలని వారు కోరారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష శిబిరంలో మద్దతు తెలుపుతున్న సర్పంచ్ సీతాలక్ష్మి

ఎటపాక: రహదారులు బాగుచేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గుండాల పంచాయతీలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవ రోజులు చేరాయి.సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ శశికుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. నాయకులు ఐవి, పద్మ, హరి, సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలి



చింతూరులో నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ

చింతూరు: ఆదివాసీ చట్టాలు, హక్కులను పరిరక్షించాలని కూనవరం జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ అన్నారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న దీక్షలను శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ప్రాంతం నుంచి ఆదివాసీలను దూరం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఆదివాసీ యువత భవిష్యత్తు కోసం చేస్తున్న ఉద్యమాలకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలోని ఉద్యోగాలను గిరిజన నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలన్నారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, డివిజన్ చైర్మన్ నరేష్, ప్రతినిధులు శ్యామల, సుబ్బయ్య, రాజ్‌కుమార్, లక్ష్మి, నిరోషా, వెంకన్నబాబు, పూర్ణ, మల్లయ్య, జోగారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో కల్వర్టు నిర్మాణం



లబుడువీధిలో శ్రమదానంలో కల్వర్టు నిర్మిస్తున్న గ్రామస్తులు

చింతపల్లి: మండలంలో ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలని తలచి తమ గ్రామానికి సొంత నిధులతో కల్వర్టు నిర్మించుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు. లబుడువీధి గిరిజనులు. మండలంలో తాజంగి పంచాయతీ పరిధిలోని బాసింగి కొత్తూరు(లబుడువీధి)కు గత కొన్నేళ్లుగా గ్రామానికి రహదారి సౌకర్యం లేక రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేకమార్లు పలువురు అధికారులకు విన్నవించుకున్నా ప్రతిఫలం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం ఒక ఇబ్బంది అనుకుంటే గ్రామ సమీపంలో పారుగెడ్డపై కల్వర్టు నిర్మాణం లేకపోవడంలో కనీసం గ్రామం నుంచి రాకపోకలు సాగిస్తున్నామని చెబుతున్నారు. దీంతో గ్రామస్తులంతా కలిసి చందాలు వేసుకుని కల్వర్టుకు అవసరమైన సిమెంటు, ఇసుక, స్టీలు వంటి నిర్మాణ సామగ్రిని సమకూర్చుకుని శ్రమదానంతో కల్వర్టును నిర్మించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు పంతులుబాబు, లింగమూర్తి, గురుమూర్తి, సింహాచలం, జగదీష్ ,బొజ్జన్న తదితరులు కోరుతున్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి

అరకులోయటౌన్: డుంబ్రిగుడ మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పాఠశాల కమిటీ చైర్మన్ పి.రంజిత్ కుమార్, వైస్ చైర్మన్ మొహిన్నమ్మ, గ్రామస్తులు ఒక ప్రకటనలో కోరారు. మొర్రిగుడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు 224 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. ఏడవ తరగతి పూర్తిచేసుకున్న వారంతా ఈ విద్యాసంవత్సరంలో సుదూరంలో ఉన్న వేరే పాఠశాలలో 8వ తరగతి చేరాల్సి ఉందని చెబుతున్నారు.ఈ మేరకు ఇక్కడున్న ఎంపీపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తే ఆయా విద్యార్థులు ఇక్కడ చదివే అవకాశముంటుందని అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణికి వినతిపత్రం అందజేశామని చెబుతున్నారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి తమ పిల్లలను విద్యాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీ



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిని వెంటనే ఖాళీ చేయాలని హెచ్చరిస్తూ రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. శుక్రవారం చింతపల్లిలో హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కాలేజి వరకు గల రోడ్డుకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో చింతపల్లిలో 65 మంది ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని వ్యాపారలు చేస్తున్నట్టు గుర్తించి నోటీసులను అందజేశారు. నోటీసులు అందుకున్న వారు స్వచ్ఛందంగా స్థలాలను ఖాళీ చేయాలని లేకుంటే రెవెన్యూశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా ఏళ్లతరబడి చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని అధికారులు పునరాలోచించాలని పలువురు కోరుతున్నారు.

పోడు భూములకు హక్కు పత్రాల కోసం వినతి

కూనవరం: ఏళ్ల తరబడి గిరిజను సాగు చేసుకుంటూన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ కూటూరు సచివాలయం పరిధిలోని పలువురు గిరిజన రైతులు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో గిరిజనులు సాగుచేసుంకుటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గిరిజన రైతులకు హక్కుపత్రాలు అందజేయాలని కోరుతున్నారు. సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, మేకల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పైదా భద్రమ్మ, రాముడు, వెంకయ్య, శ్రీకాంత్, దుర్గా తదితరులున్నారు.